ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 33.0
కనిష్ఠం 24.4
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
శుక్రవారం 8 ఆగస్టు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588.50 (307.5790)	65,930	44,149
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	2,558.31	1,062.79
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.8982 (42.5720)	27,571	17,000

చికెన్ ధరలు	లైవ్ : రూ.122	డ్రెస్ : రూ.182	స్కిన్‌లెస్ : రూ.205



పునాదుల్లోనే ఎత్తిపోతలు

నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధి మొదటిజోన్‌లోని చివరి భూములకు సాగు నీరందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ఎత్తిపోతల పథకాల పనులు ఇంకా పునాదుల్లోనే కదలాడుతున్నాయి. లక్ష ఎకరాలకు సాగు నీరందించాలనే లక్ష్యంతో ఏడు ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం రూ.కోట్లు మంజూరు చేసినా పనులు నత్తనడకన సాగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్షలు చేస్తూ ఆదేశించడంతో కొద్దొగొప్పో పనులు జరుగుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)

» లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీరు లక్ష్యం » నత్తనడకన సాగుతున్న పనులు

హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని పాలకవీడు, చింతపాలెం మండలాల్లోని భూములతో పాటు సాగర్ ఆయకట్టు చివరి భూములకు సాగునీటిని అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఆయా మండలాల్లో ఎత్తిపోతల పథకాలు నిర్మిస్తున్నారు. వీటితో పాటు గతంలో ఉన్న ఎత్తిపోతలనూ పునరుద్ధరిస్తున్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్‌నగర్ నియోజకవర్గంలో కృష్ణా నది ప్రవహిస్తుండటంతో ఆ నీటిని సద్వినియోగం చేసుకునేలా ఎత్తిపోతల పథకాలకు రూపకల్పన చేశారు. 2023లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే శరవేగంగా ఎత్తిపోతల పథకాలకు ఆమోదం లభించడడం, నిధులు మంజూరు చేయించారు. అయినప్పటికీ పనులు వేగవంతంగా సాగడం లేదన్న విమర్శలువెల్లువెత్తుతున్నాయి. ఏదిఏమైనా అభివృద్ధి పనుల వేగవంతానికి సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ ఇప్పటికే అనేకసార్లు సమీక్షలు నిర్వహించారు. పనుల నిర్లక్ష్యంపై అధికారులు, కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం. హైదరాబాద్‌లోని జయశంకర్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 5న ఎత్తిపోతల పథకాలపై మంత్రి ఉత్తమ్ సమీక్షించి పనుల వేగవంతానికి ఆదేశాలు జారీ చేశారు.

ఏడాదిన్నర కావస్తున్నా...

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఎత్తిపోతల పనులు వేగవంతం చేయడంలో అధికారులు, కాంట్రాక్టర్లు తాత్సారం చేస్తున్నారన్నారు. పనులు నెమ్మదిగా సాగడంపై ఈనెల 5వ తేదీన హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ నిర్వహించిన సమీక్ష సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు దగ్గరుండి పనులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

» నియోజకవర్గంలో రూ.1450 కోట్లతో 53 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలని చేపట్టిన అతిపెద్ద ఎత్తిపోతల పథకం ముక్త్యాల బ్రాంచ్ పథకం పనులు 25 శాతం మాత్రమే పూర్తయినట్లు సమాచారం. ఇప్పటి వరకు 200 ఎకరాల భూమి సేకరించడంతో పాటు కేవలం మూడు కిలోమీటర్ల పైప్‌లైన్ మాత్రమే నిర్మించారు. పాతవెల్లటూరు వద్ద కృష్ణానదిపై పంప్‌హౌస్ పనులు ప్రారంభించలేదు. అక్కడ పనులు నత్తనడకన సాగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.

» చింతలపాలెం మండలం పులిచింతల ప్రాజెక్ట్ దిగువ భాగంలో దొండపాడు రాజీవ్ గాంధీ ఎత్తిపోతల పథకాన్ని రూ.394 కోట్లతో ప్రారంభించారు. 14,100 ఎకరాలకు నీరందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 35 ఎకరాలకు పైగా భూసేకరణ చేశారు. పనులు ప్రారంభదశలోనే కొనసాగుతున్నాయి. పులిచింతల పవర్ విద్యుత్ ప్లాంట్ నీటితో ఈ ఎత్తిపోతలను నిర్మిస్తున్నారు. ఈ పథకాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి డిజైన్ చేశారు.

» నక్కగూడెం ఎత్తిపోతల పథకాన్ని గతంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించగా దీని పునరుద్ధరిస్తున్నారు. రూ.33 కోట్లతో 2,300 ఎకరాల ఆయకట్టు కోసం మంత్రి ఉత్తమ్ పనులకు..

- మిగతా 8వ పేజీలో...



ఉపకారం ఆలస్యం

» మూడేళ్లుగా అందని ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్
» జిల్లాలో రూ.190 కోట్ల బకాయిలు » కోదాడలో 7 డిగ్రీ కళాశాలలు మూత

ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాల కింద ఉపకార వేతనాల బకాయిలు కొండలా పేరుకుపోయాయి. జిల్లాకు సం బంధించి మూడేళ్లుగా సుమారు రూ.190 కోట్ల మేర ప్రభుత్వం బకాయిపడింది. దీం తో సర్టిఫికెట్స్ అందక విద్యార్థులు, కళాశాలలను నిర్వహించలేక కొందరు విద్యాసంస్థలను మూసివేస్తున్నారు. ఇంజనీరింగ్ కళాశాలలకు రూ.160 కోట్లు, డిగ్రీ, ఇంటర్ కళాశాలలకు కలిపి రూ.15 కోట్ల చొప్పున ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. దీంతో వాటిపై ఆధారపడిన విద్యార్థులు, విద్యాసంస్థల నిర్వాహకుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయి.

- (ఆంధ్రజ్యోతి-కోదాడ)

విద్యాసంవత్సరం పూర్తయ్యేలోగా ఫీజురీయింబర్స్‌మెంట(ఆర్‌టీఎఫ్, బోధన రుసుం), ఉపకార వేతనాలు(ఎంటీఎఫ్, మెస్‌చార్జీలు) కళాశాలలకు, విద్యార్థులకు అందించాల్సి ఉంటుంది.అయితే ఆదిశగా ప్రభుత్వంచర్యలు ఉండటం లేదు. మరోవైపు డిగ్రీలో ప్రవేశాలకు ఉపయోగిస్తున్న దోస్త్‌తో జిల్లాలోని 15 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు సంఖ్య తగ్గటంతో ఒక్క కోదాడలోనే ఏడు డిగ్రీ కళాశాలలు మూతబడ్డాయి.విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో ఎన్నోఏళ్లుగా కళాశాలలో పనిచేస్తున్న చాలామంది అధ్యాపకులు,కళాశాల నిర్వాహకులు, వాటిపై ఆధారపడిన వారి జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయి. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 120 ఉన్న ప్రైవేట్‌డిగ్రీ కళాశాలలు పదుల సంఖ్యకు తగ్గాయని పలువురు ఆరోపిస్తున్నారు.

బకాయిలతో భారంగా నిర్వహణ..

మూడేళ్లుగా జిల్లాలోని డిగ్రీ, ఇంజనీరింగ్..

- మిగతా 8వ పేజీలో...

● నేడు వరలక్ష్మీ వ్రతం



శ్రావణమాసం మహిళలకు ప్రీతికరమైనది. ఈ మాసంలో వరలక్ష్మీ అమ్మవారిని కొలుస్తుంటారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలతో ఆలయాల్లో సందడి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో సరస్వతీ అమ్మవారి జన్మనక్షత్ర ముహూర్తం కావడంతో శుక్రవారం ప్రత్యేక అభిషేకాలు, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ మాసంలో రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఆచరించడం ఆనవాయితీ. అందుకు ఆలయాలు ముస్తాబయ్యాయి.

6

ఆహార భద్రత చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 7, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆహార భద్రత చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్, అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదరికం పోవాలంటే విద్య ముఖ్యమన్నారు. రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ చేసే సమయాల్లో తూకాల్లో ఇబ్బందులు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్లు, పాలు, బాలామృతం, ఆట వస్తువులు సక్రమంగా సరఫరా చేయాలన్నారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు,పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఆహార భద్రత చట్టాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. విద్యార్థులకు రక్త పరీక్షలతో పాటు ఇతరపరీక్షలు చేయిస్తున్నామని పేర్కొన్నారు.సమావేశంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఆనంద్, శారద, భారతి, జ్యోతి, డీఆర్‌డీవో అప్పారావు, సంక్షేమాధికారులు శంకర్, దయానందరాణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, పక్కన కలెక్టర్

పెన్‌పహాడ్ మండలంలో విస్తృత పర్యటన

పెన్‌పహాడ్: మండలంలో తెలంగాణ ఫుడ్‌కమిషన్ కమిటీ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు రంగినేని శారద, ములుకుంట్ల భారతి, భూక్య జ్యోతి విస్తృతంగా పర్యటించారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌తో కలిసి ఓపీ, ఆపరేషన్ గదులను పరిశీలించారు. మందులు ఇచ్చే గది, పేషంట్ల గదులను పరిశీలించి వారు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-1,3 సెంటర్లను పరిశీలించారు. పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు పిల్లల వద్ద ఎందుకు లేవని అని అడగగా.. ఆటకెక్కిన ఆట వస్తువులను తీసి చిన్నారుల వద్ద ఉంచడంతో అంగన్‌వాడీ టీచర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బొమ్మలను చూపించి ఏ బొమ్మలో చెప్పాలని చిన్నారులను అడగగా వారు చెప్పకపోవడంతో చిన్నారులకు ప్రతిరోజూ ఆడించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలలో వంటకాలను పరిశీలించారు. పిల్లలకు నాణ్యత కలిగిన భోజనం, గుడ్లు పెట్టాలన్నారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, డీఆర్‌డీఏ అప్పారావు, డీఎస్‌వో ప్రసాద్, అధికారులు మోహన్‌రావు, శంకర్‌రావు, దయానందరాణి, మల్లేష్, శ్రీనివాస్, మల్లారెడ్డి, రాజేష్, రవి, విజయచంద్రిక, ఉపేంద్ర, అనిషా, స్వప్న, సునీత, విజయ, ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా రోడ్లు తవ్వొద్దు : ఎస్పీ



సూర్యాపేటక్రైం, ఆగస్టు 7,(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుడా జిల్లాలోని రోడ్లను ఎవరూ తవ్వొద్దని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల అవసరాలు, రవాణా నిమిత్తం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి రోడ్లు నిర్మిస్తుందని, కొందరు వారి సొంత అవసరాల కోసం రోడ్లను ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా తవ్వుతున్నారని తెలిపారు. కొందరు ట్రాక్టర్ దమ్ము చక్రాలతో రోడ్లపై వెళ్లడంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని పేర్కొన్నారు. రోడ్లను తవ్వి వదిలివేయడం వల్ల ఆ ప్రదేశంలో గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. ఎక్కడైనా అవసరం కోసం రోడ్లను తవ్వాల్సి వస్తే సంబంధిత శాఖల అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కాంట్రాక్టర్లు రోడ్లను తవ్విన సందర్భాల్లో ఆ ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాక్టర్ దమ్ము చక్రాలతో రోడ్లపై వచ్చి రోడ్లను ధ్వంసం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు నాగార్జునరెడ్డి

సూర్యాపేటటౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరి యా కొరత లేకుండా చర్యలు తీసుకోవాల ని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. పట్టణంలో ని ఎంవీఎన్ భవన్‌లో గురువారం జరిగి న సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగార్జునసాగర్ ఆయకట్టు కింద వరి సాగు ముమ్మరంగా సాగుతుందన్నారు. యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. యూరియా లేకపోవడంతో పంటలు సాగు చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. కొందరు వ్యాపారులు యూరియాను కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు రాంరెడ్డి, ఉప్పలయ్య, సైదా, క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా మ్యాపింగ్ పూర్తి చేయాలి



ఆన్‌లైన్‌లో ఓటర్ జాబితాను మ్యాపింగ్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

నూతనకల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా మ్యాపింగ్‌ను నేటితో పూర్తిచేయాలని డీఎల్‌వో నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్ మ్యాపింగ్‌ను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ ప్రభుత్వం విధించిన గడువు నేటితో ముగుస్తున్నందున ఓట రు జాబితా మ్యాపింగ్ త్వరతగతిన పూర్తిచేయాలన్నారు. ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న పంచాయతీ అడ్వాన్స్ ఇండెక్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుధ్య నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, ఎంపీవో శశికళ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి



తుంగతుర్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

తుంగతుర్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ నందలాల్ పవార్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని, కేజీబీవీ విద్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. మొదట ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులతో వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆస్పత్రిని భవన నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో మొక్కలను నాటారు. కస్తురిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు బోధన అందించాలన్నారు. అనంతరం కంప్యూటర్ ల్యాబ్‌లోకి వెళ్లి విద్యార్థులు కంప్యూటర్ ఏ విధంగా నేర్చుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో భూభారతిలో దరఖాస్తు చేసుకున్న రైతుల దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దయానందం, ఎంపీడీవో శేషకుమార్, మండల విద్యాధికారి బోయిని లింగయ్య, డిసిఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, ఏడిఏ రమేష్ బాబు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మల్ కుమార్, డాక్టర్లు వీణ, రాజు, ఆరోగ్య సిబ్బంది, ఎస్ఓ కల్పన అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. తుంగతుర్తి మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల ఎస్‌వో కల్పనకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విద్యార్థులకు సరైన వసతులు కల్పించడం, రికార్డులు సరిగ్గా నిర్వహించడంతో నోటీసులు జారీ చేశారు.

పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా చూడాలి

సూర్యాపేట(కలెక్టరేట్): జిల్లాలోని రసాయన, ఔషధ పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించకుండా తనిఖీలు నిర్వహించి నివేదికలు అందచేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. పరిశ్రమల భద్రతపై గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కమిటీతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత జూన్‌లో సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో సంభవించిన అతిపెద్ద విస్ఫోటనాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని పరిశ్రమలు, ప్రత్యేకించి రసాయన పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ నెల 14వ తేదీలోపు అన్ని పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించిన నివేదికలు అందచేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ సీతారాం పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేయాలి



సూర్యాపేట బీజేపీ కార్యాలయంలో మాట్లాడుతున్న చల్లా శ్రీలతారెడ్డి

భానుపురి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేసేలా బీజేపీ కార్యకర్తలు ప్రజలను ప్రోత్సహించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి, మాజీ అధ్యక్షుడు బొబ్బా భాగ్యారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామ, పట్టణాల్లో తిరంగా ర్యాలీలు, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు జాతీయ జెండా, దేశ గౌరవంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యకర్తలు, నాయకులు గ్రామాల్లో, మండలాల్లో, పట్టణాల్లో హర్ ఘర్ తిరంగా, తిరంగా యాత్రలు విజయవంతంగా నిర్వహించేం దుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యశాల ప్రోగ్రాం కన్వీనర్ బూర మల్సూర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, నాయకులు వంగవీటి శ్రీనివాసారావు, తుక్కాని మన్మథరెడ్డి, కర్నాటి కిషన్, చల్లమల్ల నర్సింహ, రామినేని కృష్ణయ్య, నూనె సులోచన, అనూష, బూర శకుంతల, శోభా, సీతా తదితరులు ఉన్నారు.

సంతోషిమాత జన్మదిన వేడుకలు



ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత

సూర్యాపేటటౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంతోషిమాత దేవాలయంలో సంతోషిమాత జన్మదిన వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. దేవాలయ ప్రధాన అర్చకులు శివరామకృష్ణశర్మ అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అదే విధంగా కలశస్థాపన పూజలు, కంకణధారణ, లలిత హోమం, రుద్రహోమం నిర్వహించారు. దీంతో శుక్రవారం దేవాలయంలో వరలక్ష్మి వ్రతం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాల్లో దేవాలయ కమిటీ ప్రతినిధులు మురళీధర్, రాంమూర్తి, మల్లిఖార్జున్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు బోధించాలి



ఆర్డీవో శ్రీనివాసులు, అధికారులకు రాఖీ కడుతున్న విద్యార్థులు

హుజూర్‌నగర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పాఠశాలల్లో విద్యతో పాటు నైతిక విలువలు బోధించాలని ఆర్డీవో శ్రీనివాసులు కోరారు. గురువారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో గ్రీన్‌వుడ్ విద్యార్థులు అధికారులకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలల్లో మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రుల తర్వాత గురువులను గౌరవించాలన్నారు. భారతదేశం సంస్కృతీ, సంప్రదాయాలకు నిలయమన్నారు. కుటుంబ బంధాలు తెలిపే రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. విద్యార్థులు సొంతగా రాఖీలు తయారుచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జునరెడ్డి, టి. మర్రెడ్డి, సరితారెడ్డి, రాజిరెడ్డి, కృష్ణారావు పాల్గొన్నారు.

ఫోన్ పోయినా...చింతెందుకు



● సీఈఐఆర్ పోర్టల్‌తో పట్టుకునే అవకాశం
● ఈ ఏడాదిలో జిల్లాలో 719 ఫోన్లు రికవరీ

వివరాలు 6లో

ఫోన్ పోయినా చింతెందుకు..

» సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఎక్కడుందో గుర్తింపు » ఈ ఏడాది 1,376 ఫోన్లకు 710 స్వాధీనం, అప్పగింత

రంగారావు కుమారుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరాడు. మొదటి వేతనంతో రూ.50 వేలు వెచ్చించి ఓ కొత్త ఫోన్‌ను తండ్రికి బహుమతిగా ఇచ్చాడు. ఒక రోజు ఆయన సెల్‌ఫోన్‌ను ఎక్కడో పోగొట్టుకున్నాడు. కుమారుడు ప్రేమతో బహుమతిగా ఇచ్చింది, అందునా రూ.వేలు ఖర్చు చేసి కొన్నది కావడంతో దిగాలు చెందాడు. ఫోన్ కొనుగోలు చేసిన బిల్లు చూపించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ ద్వారా ఫోన్ ఎక్కడుందో కనిపెట్టి అప్పగించారు. దీంతో రంగారావు ఆనందానికి హద్దుల్లేకుండాపోయాయి. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాదిలో 1,367 ఫోన్లు పోగా 710 ఫోన్లను పోలీసులు బాధితులకు అప్పగించారు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేటక్రైం)

ప్రస్తుత సాంకేతిక యుగంలో సెల్‌ఫోన్ ప్రతి ఒక్కరికీ ఎంతో ప్రధానమైనది. ప్రస్తుత సమాజంలో ఫోన్ లేని వారు చాలాఅరుదు. చిన్నారులు, కొంతమంది వృద్ధులను మినహాయిస్తే అందరూ ఫోన్ వాడుతున్నారు. వారి వారి స్థోమతకు తగిన వివిధరకాల కంపెనీల ఫోన్లు వినియోగిస్తున్నారు. ఇందుకోసం రూ.వేల నుంచి రూ.లక్షల వరకు వెచ్చిస్తున్నారు. ఫోన్ మాట్లాడుకోవడానికే కాకుండా ఇతరత్రా అవసరాల తీర్చేందుకూ ఉపయోగపడుతోంది. అధునాతన సాంకేతికతతో కూడిన ఫోన్లలో వ్యక్తిగత బ్యాంక్ సంబంధిత వివరాలు, డ్రైవింగ్, ఆధార్, సర్టిఫికెట్లు, ఇతరత్రా సమాచారాలను నిక్షిప్తం చేసుకునే వీలుంటుంది. అలాగే వివిధ సందర్భాల్లో తీసుకున్న ఫొటోలు, డాక్యుమెంట్లు ఇలా ఎన్నో అవసరాలు ఫోన్‌తో ముడిపడి ఉన్నాయి. అంతేకాకుండా ఇటీవల ప్రతి ఒక్కరూ వ్యాపార లావాదేవాలను సైతం గూగుల్ పే, ఫోన్ పే వంటి ద్వారా కొనసాగిస్తున్నారు. దీంతో ఫోన్ వినియోగం అనేది అనివార్యమైంది. అయితే ఆయా ఫోన్లను కొందరు దొంగలు చోరీ చేస్తుండగా, మరికొన్ని సందర్భాల్లో అజాగ్రత్తతో పోగొట్టుకుంటున్నారు. ఫోన్లు దొరికిన వారు కొందరు తిరిగి యజమానులకు అప్పగిస్తుండగా, దొంగలు మాత్రం ఇతరులకు తక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఫోన్ పోతే ఇబ్బందులే...

సెల్‌ఫోన్లు పోయిన సమయాల్లో అందులో భద్రపరిచిన వివరాలు, నెంబర్లు ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. దీంతో కొంత ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. చోరీచేసిన ఫోన్లతో లావాదేవీలు నడిపి బాధితుల బ్యాంక్ ఖాతాలు కొల్లగొట్టిన సందర్భాలూ ఉన్నాయి. వీటన్నింటికీ దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్‌ను తెచ్చింది. పోయిన ఫోన్లను రాబట్టేందుకు ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్)పోర్టల్‌లో నమోదు చేస్తే సరిపోతుంది. పోయిన ఫోన్‌ను ఎవరైనా వినియోగిస్తే వెంటనే సమాచారం పోలీసులకు తెలిసిపోతుంది.

పోర్టల్‌లో నమోదు చేయాలి

ఏదైనా సందర్భంలో సెల్‌ఫోన్ చోరీకి గురైనా, అజాగ్రత్తతో పోయినా వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంది. సంబంధిత పోర్టల్‌లోకి వెళ్లగానే రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ లాస్ట్, స్టోలెన్ మొబైల్ లింక్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయాలి. అందులో సెల్‌ఫోన్‌కు సంబంధించిన 15 డిజిట్స్ ఐఎంఈఐ నెంబరు, ఫోన్ కంపెనీ పేరు, మోడల్ పేరు, కొనుగోలు చేసిన బిల్లును నమోదు చేయాల్సి ఉంది. తర్వాత ఓటీపీ కోసం మరో సెల్‌ఫోన్ నెంబరు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ వివరాలను నమోదు చేసిన తర్వాత ఫిర్యాదుదారుడికి ఐడీ నెంబరు వస్తుంది. అనంతరం ఆ మొబైల్ పని చేయకుండా చేస్తుంది. ఏ కంపెనీ సెల్‌ఫోన్ అయినా సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయగానే బ్లాక్ అవుతుంది. ఇక దానిని ఎవరు వినియోగించలేరు. దీంతో పాటు ఫోన్ ఎక్కడ ఉందనే వివరాలు పోలీస్ శాఖలోని ఐటీ సెంటర్‌కు అందుతుంది. దీంతో ఐటీ సెల్ పోలీసులు పోయిన ఫోన్‌ను రికవరీ చేస్తారు. ఫోన్‌పోయిన సందర్భంలో మీసేవా కేంద్రాల్లో అయినా, పోలీస్‌స్టేషన్‌లో అయినా నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.



ఫోన్లను రికవరీ చేసి యజమానులకు అందజేస్తున్న ఎస్పీ(ఫైల్)

జిల్లాలో 1,367 ఫిర్యాదులు

జిల్లా పరిధిలో ఈ ఏడాదిలో ఫోన్లు పోయినట్లు సీఈఐఆర్ పోర్టల్‌లో 1,367 మంది ఫిర్యాదులు వచ్చాయి. ఆ ఫిర్యాదులపై ఐటీ సెల్ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి ఇప్పటివరకు 710 ఫోన్లను స్వాధీనం చేసుకుని ఫోన్ల యజమానులకు అప్పగించింది. గతంలో ఫోన్లు పోతే తిరిగి లభించడం చాలాకష్టంగా ఉండేది. ఏదైనా కేసుకు సంబంధించిన సీడీఆర్‌లో ఫోన్ వివరాలు నమోదు చేస్తే, ఆ ఫోన్‌ను ఎవరైనా వినియోగిస్తే అప్పుడు కానీ పట్టుకునే వారు. చాలామంది ఫోన్లు పోయినప్పుడు చేసేది లేక కొత్త ఫోన్లు కొనుగోలు చేసేవారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలులోకి తెచ్చిన సీఈఐఆర్ పోర్టల్‌తో ఇబ్బందులు తొలగిపోయాయి.

పాతఫోన్లను కొనుగోలు చేయొద్దు



పాతఫోన్లను ఎలాంటి రశీదు లేకుండా కొనుగోలు చేయవద్దు. ఎక్కువగా పాతఫోన్లు చోరీ చేసినవి ఉంటాయి. అలాంటి ఫోన్లను కొనుగోలు చేస్తే పోలీసులకు పట్టుబడతారు. ఫోన్లు పోతే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయాలి. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోయిన ఫోన్‌ను రికవరీ చేసే అవకాశం ఉంది.

- కొత్తపల్లి నర్సింహ, ఎస్పీ

అనకాపల్లి టూ ఢిల్లీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

చిట్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి నుంచి ఢిల్లీకి గంజాయిని కార్లలో తరలిస్తున్న ముఠా గుట్టును నల్లగొండ జిల్లా పోలీసులు రట్టు చేశారు. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ ముఠా సభ్యుడిని అరెస్టుచేసి 250కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గురువారం చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నల్లగొండ జిల్లా చిట్యాల పోలీసులు గురువారం తెల్లవారుజామున 65వ నెంబరు జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. పట్టణంలోని సుజన థియేటర్ సమీపంలో ఢిల్లీ నెంబర్ ప్లేట్ ఉన్న కారు హైదరాబాద్ వైపు వెళుతుండటంతో కారు ఆపి లోపల ఉన్న ముగ్గురిని పోలీసులు ప్రశ్నించారు. ఇద్దరు అక్కడినుంచి పారిపోగా, ఒకరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించటంతో తమకు సంబంధించిన మరో కారు వెనుకగా వస్తుందని సమాచారమిచ్చాడు. ఆ మేరకు వచ్చిన కారును ఆపేందుకు ప్రయత్నించగా విజయవాడ వైపు వేగంగా వెళ్లిపోయి కట్టంగూరు మండల పరిధిలో చెట్ల పొదల్లో వదిలి పరారయ్యారు. పట్టుబడిన వ్యక్తిని విచారణ చేయగా తన పేరు నూర్ మహ్మద్‌గా అని, పారిపోయిన ఇద్దరు ఉత్తరప్రదేశ్‌కు చెందిన బబ్లూ, మంగల్, ఢిల్లీకి చెందిన జమీల్, భాను, కన్నాయి అధికారిగా సమాచారమిచ్చాడు. ఆంధ్రప్రదేశ్ నుంచి గంజాయి తీసుకురావాలని ఢిల్లీకి చెందిన మొనీస్ అలియాస్ రాహుల్ మిశ్రా మూడు కార్లు ఇచ్చి పంపారని, ఇందుకోసం ఒక్కొక్కరికి రూ. 20వేలు ఇస్తారని తెలిపారు. రెండు కార్లలో గంజాయి ప్యాకెట్లు సర్దుతామని, ఒక కారు తమను అనుసరిస్తూ వస్తుందని చెప్పాడు. తామంతా కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి ప్రాంతానికి వెళ్లి గంజాయి ప్యాకెట్లను కార్లలో సర్దుకుని ఢిల్లీకి వెళ్లి నిర్ణీత ప్రదేశంలో కారు నిలుపుదల చేసి వెళ్లిపోతామని పోలీసులకు తెలిపాడు. తనిఖీల్లో పట్టుబడిన రెండు కార్లను తనిఖీచేసి వాటిలో ఉన్న 250 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ సుమారు రూ.70లక్షలు ఉంటుందని డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. 250కిలోల గంజాయితో పాటు రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గంజాయి పట్టుకున్న సంఘటనలో చురుకుగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు మల్లేష్, వెంకన్నను అభినందించారు. విలేకరుల సమావేశంలో సీఐ నాగరాజు, ఎస్ఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఆరుగురిపై కేసు నమోదు

ఆత్మకూరు(ఎస్) / కనగల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట, నల్లగొండ జిల్లాలో గంజాయి సేవిస్తున్న ఆరుగురిపై కేసులు నమోదయ్యాయి. ఇందుకు సంబంధించి సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్)లో డీఎస్పీ ప్రసన్నకుమార్ వివరాలు వెల్లడించారు. పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు ఏనుబాముల సమీపంలో అనుమానస్పందంగా ఇద్దరు వ్యక్తులు కనిపించడంతో విచారణ చేయగా గంజాయి సేవిస్తున్నట్లు తెలిపారు. గట్టికల్ గ్రామానికి చెందిన మడ్డి అయోధ్య, నెమ్మికల్‌కు చెందిన పాతులోతు రిత్విక్‌రాథోడ్ కలిసి గంజాయి సేవిస్తున్నట్లు తెలిపారు. వారి వద్ద దొరికిన 108గ్రాముల గంజాయిని, బైక్, రెండు సెల్ ఫోన్లను సీజ్ చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో గంజాయి సేవిస్తున్న నలుగురిని పట్టుకున్నట్లు ఎస్ఐ రాజీవ్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ పట్టణానికి చెందిన ఇమ్రాన్ రిజ్వాన్ సూర్యకిరణ్‌తో పాటు అనుముల మండలం మారెపల్లికి చెందిన ఇర్ఫాన్‌లు అమ్మగూడెం స్టేజీ వద్ద అనుమానాస్పద రీతిలో కనిపించగా స్థానికుల సమాచారం మేరకు అక్కడికి వెళ్లగా గంజాయి తాగుతూ పట్టుబడ్డారని తెలిపారు. చండూరు సీఐ ఆదిరెడ్డి పర్యవేక్షణలో కేసు నమోదు చేసి యువకులను రిమాండ్‌కు తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మద్దిరాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం పోలుమళ్ల గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఎస్ఐ వీరన్న తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అర్పిరాల గ్రామానికి చెందిన వల్లపు సోమనర్సమ్మ(75) తల్లిగారి ఇల్లు పోలుమళ్ల గ్రామానికి ఆర్టీసీ బస్సులో వచ్చింది. ఆమె రోడ్డు దాటుతుండగా దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన కేతం రాజు కారును అతివేగంగా నడుపుతూ సోమనర్సమ్మ ఢీకొట్టాడు. ప్రమాదంలో సోమనర్సమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. సోమనర్సమ్మ మనవడు వల్లపు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరన్న తెలిపారు.

ఖమ్మం జిల్లాలో ఎన్నెస్పీ వర్క్ఇన్‌స్పెక్టర్



హుస్సేన్(ఫైల్)

కూసుమంచి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పాలేరు జలా శయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎన్నెస్పీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మృతి చెందారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన బండ్ల హుస్సేన్(58) ద్విచక్రవాహనంపై హుస్సేన్ రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హుస్సేన్ మృతికి నీటిపారుదలశాఖ అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

శంభులింగేశ్వరస్వామి ఆలయంలో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

నార్కట్‌పల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఏపీ లింగోటం గ్రామ కూడలిలోని శంభులింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ క్రాంతికుమార్, గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ కూడలిలోని శంభులింగేశ్వరస్వామి ఆలయాన్ని తెరిచేందుకు అర్చకుడు ఎల్లాప్రగడ వెంకటేశ్వరశర్మ గురువారం తెల్లవారుజామున వచ్చారు. ఆలయ పరిసరాల్లో హుండీ పక్కకు పడవేసి ఉండటం, గర్భాలయానికి ఉన్న ఇనుపజాలి ద్వారాలకు వేసిన తాళం ధ్వంసమై ఉండటాన్ని గమనించి సమాచారాన్ని గ్రామస్థులకు తెలిపాడు. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలంలో క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది. సుమారు 4 తులాల విలువైన బంగారు పుస్తెలు ఇతర ఆభరణాలు, శంభులింగేశ్వర స్వామికి అలంకరించే వెండి ఆభరణాలు షటారి, పూజాపాత్రలు చోరీకి గురైనట్లు గుర్తించారు. వీటితో పాటు భక్తులు కానుకల రూపంలో హుండీలో సమర్పించిన సుమారు రూ.40,000ల నగదును కూడా చోరీ చేశారు. కాగా బుధవారం అర్ధరాత్రి ఆలయ సమీపంలో గుర్తుతెలియని ముగ్గురు యువకులు సంచరించిన దృశ్యాలు ఆలయ పరిసరాల్లోని గ్రామస్థుల నివాసాల్లోని సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పోరెడ్డి నర్సింహారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్ ఎస్ఐ తెలిపారు.

అనర్హులకు కల్యాణలక్ష్మి అమలుపై కలెక్టర్ ఆగ్రహం

పాలడుగు కార్యదర్శి, మోత్కూరు ఆర్ఐ సస్పెన్షన్

మోత్కూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో అనర్హులకు కల్యాణలక్ష్మి పథకం వర్తించడంపై కలెక్టర్ హనుమంతరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి గ్రామ కార్యదర్శి శోభన్, మోత్కూరు ఆర్ఐ దాసరి శ్రీనివాస్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పదేళ్ల కిందట వివాహమైన పాలడుగు గ్రామానికి చెందిన మహిళకు కల్యాణలక్ష్మి వర్తింపజేశారు. రూ.లక్షా 116ల చెక్కును జూలై చివరి వారంలో ఆమె తల్లి తీసుకుంది. విషయం బయటకు వచ్చి కలెక్టర్ హనుమంతరావు దృష్టికి వెళ్లడంతో విచారణకు ఆదేశించారు. ఆర్డీవో ఆదేశాల మేరకు తహసీల్దార్ జ్యోతి ఈ నెల 1న గ్రామానికి వెళ్లి విచారించి నివేదికను ఆర్డీవోకు అందించింది. ఈ నేపథ్యంలో అనర్హురాలికి కల్యాణలక్ష్మి పథకం మంజూరుకు కారుకులైన పైరవీకారులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు దాసరి తిరుమలేష్ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కల్యాణలక్ష్మి చెక్కు తీసుకున్న లబ్ధిదారు వల్లపు సోమలక్ష్మీ నుంచి తహసీల్దార్ డబ్బులు రికవరీ చేశారు. తహసీల్దార్, ఆర్డీవోల నివేదికల మేరకు పంచాయతీ కార్యదర్శి శోభన్, ఆర్ఐ శ్రీనివాస్ సమగ్ర విచారణ జరుపకుండానే కల్యాణలక్ష్మి పథకం మంజూరుకు కారణమయ్యారని కలెక్టర్ వారిద్దరిని సస్పెండ్ చేశారు.

కర్మకాండలకు వెళ్లి వస్తూ వాగులో పడి మృతి

ఆత్మకూరు(ఎస్), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : బంధువుల దశదినకర్మలకు వెళ్లి వాగులో పడి మహిళ మృతి చెందింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం ఏపూరు శివారులో గురువారం జరిగింది. ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం నూతనకల్ మండలం మిర్యాల గ్రామానికి చెందిన పచ్చిపాల నాగమ్మ(45) ఈ నెల 4న మోతె మండలం సర్వారం గ్రామంలో బంధువుల దశదినకర్మకు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో ఏపూరు గ్రామ శివారులోని పాలేరు వాగులో కాలకృత్యాల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో పడి చనిపోయినట్లు తెలిపారు. గురువారం స్థానికులు చూసి సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని తీశామన్నారు. నాగమ్మ కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

● చదువుతో ఉన్నతంగా ఎదగాలి



తుంగతుర్తి: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ సందర్శించారు. కొద్దిసేపు టీచర్‌గా వ్యవహరించారు. విద్యార్థులతో మాట్లాడారు.

● బాగా చదివి నాలా కలెక్టర్ కావాలి



పీఏపల్లి: నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలంలోని దుగ్యాల తెలంగాణ ఆదర్శ పాఠశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కష్టపడి చదివి తనలా కలెక్టర్ కావాలని సూచించారు.

వివాహిత ఆత్మహత్య: మృతిపై బంధువుల అనుమానం

కోదాడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని చెరువుబజార్‌కు చెందిన ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. కోదాడ సీఐ శివశంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెరువుబజార్‌కు చెందిన ఉప్పతల లక్ష్మి(40) భర్త శ్రీనివాసుతో నెలకొన్న తగాదాల నేపథ్యంలో బుధవారం రాత్రి ఉరివేసుకుంది. తెల్లవారుజామున కుటుంబ సభ్యులు గమనించినట్లు సీఐ తెలిపారు. లక్ష్మికి భర్తతో పాటు ఇద్దరు పిల్లలు ఉండగా కుమార్తె హాసిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా లక్ష్మిని భర్త శ్రీనివాస్ కొన్నేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని లక్ష్మి బంధువులు అన్నారు. హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు బంధువులు ఆరోపించారు.

మేజర్‌కాల్వలో మునిగి జూనియర్ అసిస్టెంట్ మృతి



అంజద్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మేజర్ కాల్వలో ఈతకు వెళ్లి సుడిగుండంలో చిక్కుకొని ఓ జూనియర్ అసిస్టెంట్ మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం కాల్వలపల్లి మేజర్ కాల్వలో గురువారం జరిగింది. స్థానికులు, రూరల్ ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డకు చెందిన అంజద్ దేవరకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గురువారం తన స్నేహితుడైన నాగులతో కలిసి కాల్వపల్లి మేజర్ వద్దకు వెళ్లారు. మేజర్‌కాలువ తూము సమీపంలో ఈత కొడుతూ సుడిగుండాల్లోకి వెళ్లిన అంజద్ నీట మునిగి ఊపిరాడక మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. అయితే కాల్వలో నీటి ప్రవాహం ఐదు అడుగుల కంటే తక్కువగా ఉన్నప్పటికీ అంజద్ మృతి చెందడంపై కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంజద్‌కు ఇద్దరు పిల్లలు ఉండగా, భార్య ఆసియాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

గ్రామీణ వైద్యులు ప్రథమ చికిత్సకే పరిమితం కావాలి



క్లినిక్‌లో ఔషధాలు, ఇంజక్షన్లను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో జయమనోహరి

మునగాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ వైద్యులు ప్రథమచికిత్స వరకే పరిమితం కావాలని, అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని సూర్యాపేట జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో జయమనోహరి అన్నారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలకేంద్రంలో గ్రామీణ వైద్యుడు చంద్రమౌళి నిర్వహిస్తున్న క్లినిక్‌లో చికిత్సపొందిన ఓ వ్యక్తి మూడురోజుల క్రితం మృతి చెందాడు. ఈ ఘటనపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం ఆమె విచారణ చేపట్టారు. క్లినిక్‌లో ఉపయోగిస్తున్న ఔషధాలను, ఇంజక్షన్లను, ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 20 ఏళ్లుగా క్లినిక్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ చికిత్సపొందిన వారిలో ఆరుగురు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారన్నారు. విషయాలన్ని రికార్డు చేసి నివేదికను డీఎంహెచ్‌వోకు అందిస్తామన్నారు. ఆమె వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి రవీందర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలదాడిలో 80 గొర్రెలు మృతి

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామంలో వీధికుక్కల దాడిలో 80 గొర్రెలు మృతి చెందాయి. గురువారం ఆలేరు పశువైద్యాధికారి చైతన్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరు పట్టణానికి వనెఅంగడి సంపత్ తన గొర్రెలను కాచారం గ్రామశివారులో ఉంచారు. ఈ నెల 6న అర్ధరాత్రి వీధికుక్కలు గొర్రెలమందపై దాడి చేయడంతో 80 గొర్రెలు మృతి చెందగా, మరో 20 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్, జిల్లా పశువైద్యాధికారికి పంపించనున్నట్లు చైతన్య తెలిపారు. ఆమెతో సిబ్బంది, గొర్రెలపెంపకందారుడు సంపత్, గ్రామస్థులు ఉన్నారు.

పిడుగుపాటుకు మూడు మేకలు..

మేళ్లచెర్వు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలో పిడుగుపాటుకు గురై మూడు మేకలు మృతి చెందాయి. గురువారం హేమ్లాతండా సమీపంలో పొలాల్లో పిడుగుపాటుకు గురై రెండు, మేకలు, ఒక మేకపోతు మృతి చెందాయి. జీవాల విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

వరలక్ష్మీదేవి రావమ్మా...

● ఆలయాల్లో శ్రావణమాస సందడి

● నేడు వరలక్ష్మీవ్రతం



(ఆంధ్రజ్యోతి-నల్లగొండ కల్చరల్ / మిర్యాలగూడ టౌన్ / నిడమనూరు)

ఆలయాల్లో శ్రావణమాస సందడి కనిపిస్తోంది. ముఖ్యంగా మహిళలు ఈ మాసంలో వారికి ప్రీతిపాత్రమైన వరలక్ష్మీ అమ్మవారిని కొలుస్తుంటారు. మొదటి రోజు నుంచే అర్చనలు, అభిషేకాలతో సోమ, శుక్రవారాల్లో ఉపవాసాలు ఉంటుంటారు. శనివారాల్లో ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అమ్మవారి విగ్రహాలను అలంకరించి భక్తిశ్రద్ధలతో నోమితో కోరికలు తీరుతాయని మహిళల నమ్మకం. అమ్మవారిని పూజిస్తే సిరి సంపదలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో సరస్వతీ అమ్మవారి జన్మనక్షత్ర ముహూర్తం కావడంతో శుక్రవారం రోజులు ప్రత్యేక అభిషేకాలు, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అదేవిధంగా ఈ మాసం అత్యంత ప్రధానమైన రెండో శుక్రవారం నిర్వహించే వరలక్ష్మీ వ్రతం నిర్వహణకు ఆలయాలు ముస్తాబయ్యాయి.

మార్కెట్‌కు 'శ్రావణ' శోభ

శ్రావణమాస పర్వదినాల్లో వరలక్ష్మీ వ్రతం ఎంతో ముఖ్యమైంది. మహిళల నోములకు ముఖ్యమైన మాసాల్లో ఈ మాసం ప్రథమం. ఎక్కువగా పూజలు, లక్ష్మీదేవి వ్రతాలు చేస్తుంటారు. దీంతో మార్కెట్ పండుగ శోభ సంతరించుకుంది. సందడి జోరుగా కనిపిస్తోంది. వరలక్ష్మీ వ్రతంలో మహిళలు బంగారు లక్ష్మీ కాసులతో(రూపులు)అమ్మవారిని పూజించడం ఆనవాయితీగా వస్తోంది. కనీసం చిన్న బంగారు కాసుతోనైనా పూజిస్తే అమ్మవారి కరుణా కటాక్షాలు కలిగి ఇంటా సిరులు కురుస్తాయని విశ్వాసం. దీంతో బంగారుకాసులు కొనేందుకు మహిళలు ఎంతో ఆసక్తి చూపుతుంటారు. ఈ నేపథ్యంలో అమ్మవారి బంగారు కాసులకు డిమాండ్ పెరిగింది.

ముస్తాబైన ఆలయాలు



శ్రావణంలో ప్రతి రోజూ పండుగే. అలాంటిది వరలక్ష్మీ వ్రతం జరుపుకునే శ్రావణ శుక్రవారం మహిళలు పెద్దసంఖ్యలో పూజలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు ఆలయాలు వేడుకలకు సిద్ధమయ్యాయి. మిర్యాలగూడలోని సరస్వతీ సమేత కనకదుర్గ ఆలయం, రుక్మిణీ సమేత శ్రీకృష్ణాలయం(గీతామందిర్)లలో సామూహిక వ్రతాలు జరిపేందుకు ప్రత్యేకఏర్పాట్లు చేశారు. శివాలయం, ఉమామహేశ్వరాలయాల్లో ప్రత్యేక శని పూజలు జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నల్లగొండ పట్టణంలోని వీటీకాలనీలోని శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయం, బీట్ మార్కెట్‌లోని శ్రీ రామకోటి స్థూప దేవాలయం, పలు దేవాలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశారు. కొన్ని ఆలయాల్లో చిన్నారులకు అక్షరఅభ్యాస కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నారు.



నల్లగొండలో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

పూలకు భలే గిరాకీ

వరలక్ష్మీ వ్రతాల పర్వదినం సందర్భంగా పూలకు డిమాండ్ పెరిగింది. ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాలలో గురువారం సాయంత్రం వివిధ రకాల పూలను రాశులుగా పోసి విక్రయాలు జరిపారు. బంతి పూలు ఇలో రూ.160, చామంతి కిలో రూ.500, మల్లెపూలు కిలో రూ.1200, కనకాంబరాలు రూ.1200, కాగడ మల్లెపూలు రూ.800, గులాబీలు రూ.500, తోక బంతిపూలు రూ.250, విరజాజులు కిలో రూ.800, మూర పూలు రూ.50, మీటరు రూ.100 చొప్పున విక్రయాలు జరిగాయి. అదేవిధంగా దేవాలయాల ముస్తాబుకు కూడా ఆలయ కమిటీ నిర్వాహకులు పెద్ద ఎత్తున పూలను కొనుగోలు చేశారు.

పోగు బతుకు భారం

● అర్ధాకలితో కాలం వెళ్లదీస్తున్న చేనేత కుటుంబాలు



పోగు బతుకు భారమవుతోంది. రోజంతా కష్టపడితే వచ్చే కూలితో పొట్ట నిండడం కష్టమవుతోంది. ఎన్నో చేనేత కుటుంబాలు అర్ధాకలితో కాలం వెళ్లదీస్తున్నాయి. వారసత్వ వృత్తిని, కళను కాపాడుకునేందుకు చేనేత కార్మికులు ఎంతో శ్రమిస్తున్నారు. మాస్టర్ వీవర్ వద్ద నూలు తెచ్చుకుని చీరెలు నేస్తున్నందున, తమకు కూలి మాత్రమే వస్తుందన్నారు. ఇక్కత్ హాండ్లూమ్ క్లస్టర్ కేంద్రానికి అనుబంధంగా రంగుల అద్దకం కేంద్రం ఏర్పాటు చేస్తే మరి కొందరికి ఉపాధి దొరకడంతో పాటు తమకు మరింత ఆదాయం పెరుగుతుందందని చేనేత కార్మికులు పేర్కొంటున్నారు.

● ఆంధ్రజ్యోతి - మోత్కూరు, యాదగిరిగుట్ట రూరల్

జీవితం భారంగా మారింది



సొసైటీల ద్వారా కాకుండా మాస్టర్ వీవర్స్ ద్వారా కూలితో జీవితం భారంగా మారింది. పని ఎక్కువ అవుతుంది. ఆదాయం తక్కువగా ఉంటుంది. భార్యభర్త ఇద్దరూ కష్టపడి పని చేస్తే నెలకు రూ.15వేలు మాత్రమే వస్తుంది. కుంటుంబం గడవడం కష్టంగా మారింది.

● బడుగు వెంకటేశ్, చేనేత కార్మికుడు యాదగిరిగుట్ట.

కుటుంబ భారం నాపై పడింది



15 సంవత్సరాల క్రితం భర్త మృతిచెందడంతో కుటుంబ భారం నాపై పడింది. మగ్గం పని చేస్తూ కూతురు, కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ప్రస్తుతం మగ్గం నేయడం పెనుభారంగా మారింది. మాస్టర్ వీవర్స్ ద్వారానే వార్పు తేవడంతో నెలకు తక్కువ కూలి వస్తుంది. ప్రభుత్వం ప్రత్యేక భద్రత కల్పించి సబ్సిడీలతో వార్పు ఇవ్వాలి

● దేవతల లత, చేనేత మహిళా కార్మికురాలు యాదగిరిగుట్ట

సొసైటీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి



12 సంవత్సరాలుగా సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో చేనేత కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. సహకార ఎన్నికలు వెంటనే నిర్వహించాలి. మాస్టర్ వీవర్స్ వద్దకాకుండా సొసైటీల ద్వారా వార్పు అందజేసి ఉత్పత్తులను టెస్కోల ద్వారా కొనుగోలు చేసి వెంటనే డబ్బులు ఇవ్వాలి. షరతులు లేకుండా మగ్గంనేసే ప్రతి కార్మికుడికీ బీమా సౌకర్యం కల్పించాలి.

● బి. మల్లేశం, చేనేత కార్మికుడు, యాదగిరిగుట్ట

ఇక్కత్ హ్యాండ్లూమ్ క్లస్టర్‌లో ఉపాధి పొందుతున్నా..



మాకు ఇంటి వద్ద మగ్గం ఉంది. దానిపై నేసినప్పుడు మూడు, నాలుగు రోజులకు ఒక చీర నేసేవాడిని. సుమారు మూడేళ్లుగా ఇక్కత్ హ్యాండ్లూమ్ క్లస్టర్‌లో మగ్గం నేస్తున్నాను. నెలకు సుమారు రూ.14వేల ఆదాయం వస్తుంది. ఇంటివద్ద ఉన్న మగ్గంపై నా భార్య నేస్తున్నది. ఆమె నెలకు సుమారు రూ.6వేలు సంపాదిస్తోంది. ఇలా కుటుంబాన్ని పోషించు కుంటున్నాం. ప్రభుత్వం వృత్తి నైపుణ్యాన్ని పెంచుకునేందుకు కొత్త డిజన్లపై తరుచూ శిక్షణ ఇవ్వాలి.

● పోచం రాజు, చేనేత కార్మికుడు, మోత్కూరు

పోచంపల్లి చేనేత వస్త్రాలకు విశ్వఖ్యాతి

● హరియాణా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పోచంపల్లి చేనేత ఇక్కత్ చీరలకు దేశ, విదేశాల్లో మంచి ప్రాముఖ్యత ఉందని, విశ్వఖ్యాతి పొందాయని హరియాణా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో గురువారం జరిగిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. స్థానిక కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దత్తాత్రేయ మాట్లాడుతూ గ్రామీణ కుటీర పరిశ్రమను గుర్తించి జాతీయ దినోత్సవం ఏర్పాటు చేసిన ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు. సంప్రదాయ చేనేత కళను ఆదరించాలని, చేనేత చీర భారతీయ మహిళలకు ప్రతీక అని అన్నారు. చేనేత వస్త్రాలు ధరించి చేనేతను ఆదరిద్దామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది, అధికారులు, అన్ని వర్గాల ప్రజలు చేనేత వస్త్రాలు ధరించాల్సిందిగా కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతకు మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. తక్కువ వడ్డీతో చేనేత కార్మికులకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. చేనేత కార్మికులకు ఆరోగ్య బీమా, పిల్లలకు ఉన్నత విద్యకు సహకారం అందేలా స్కీమ్‌లు అమలు చేయాలన్నారు. భూదాన్‌పోచంపల్లిలో సీడీపీ సెంటర్‌ను ఏర్పాటు



మాట్లాడుతున్న హరియాణా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

చేసేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతానన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీకి భారత రత్న అవార్డు ఇచ్చే విధంగా భారత ప్రభుత్వాన్ని కోరుతానన్నారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వంతో మాట్లాడి సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం పట్టణంలోని చేనేత కార్మికుల గృహాలు సందర్శించి మగ్గాలపై చేనేత వస్త్రాల తయారీ ప్రక్రియలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే



మగ్గం పరిశీలిస్తున్న బండారు దత్తాత్రేయ

వన్నాల శ్రీరాములు, ఆలిండియా హ్యాండ్లూమ్ బోర్డు మాజీ డైరెక్టర్ కర్నాటి ధనుంజయ, మాజీ సర్పంచ్ నోముల గణేష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములుశ్రేష్ఠి, చేనేత నాయకులు భారత లవకుమార్, కర్నాటి బాలరాజు, అంకం పాండు, భారత వాసుదేవ్, మెరుగు శశికళ, రాపోలు శ్రీనివాస్, గంజి బాలరాజు, అంకం మురళి, బోగ నర్సింహ, ఇంజమూరి యాదగిరి పాల్గొన్నారు.

అవార్డులు ప్రదానం

సంస్థాన్‌నారాయణపురం, భూదాన్‌పోచంపల్లి, చండూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన చేనేత జాతీయ గజం నర్మద, గూడ పవన్ అవార్డులు అందుకున్నారు. న్యూఢిల్లీలోని భారత్ భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో వారికి కేంద్ర జౌళి శాఖమంత్రి గిరిరాజ్ సింగ్ అవార్డులు ప్రదానం చేశారు. అవార్డుతో పాటు ప్రశంసాపత్రం నగదు బహుమతి అందజేశారు.

● హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో చేనేత కళాకారులు సామల భాస్కర్, కొలను శంకర్, మంగళపల్లి శ్రీహరి, అవ్వారు రవీంద్రకు చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అవార్డులు ప్రదానం చేశారు.



ఢిల్లీలో కేంద్రమంత్రి గిరి రాజ్‌సింగ్ నుంచి చేనేత జాతీయ అవార్డు అందుకుంటున్న చేనేత కళాకారులు గూడ పవన్, గజం నర్మద, హైదరాబాద్‌లో మంత్రి నాగేశ్వర్‌రావు నుంచి అవార్డు అందుకుంటున్న మంగళపల్లి శ్రీహరి, సామల భాస్కర్, అవ్వారు రవీంద్ర

న్యాక్ ఏ గ్రేడ్ లక్ష్య సాధనగా ప్రణాళికలు

● ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మూడో విడత న్యాక్ గ్రేడింగ్ లో ఏ ర్యాంక్ సాధించే దిశగా ప్రణాళికలు ఉండాలని ఎంజీయూ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అధ్యాపకులకు సూచించారు. యూనివర్సిటీ చాంబర్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యాక్‌కు అందించే సెల్ఫ్‌స్టడీ రిపోర్ట్‌లోని అంశాలపై అధ్యాపకులు క్షుణ్ణంగా అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా తమ విభాగాల ప్రత్యేకతల అనుసారం ముందుకు సాగాలన్నారు. ప్రతి విభాగం విధిగా వర్క్‌షాపులు, సెమినార్ల నిర్వహణతో పాటు పరిశోధనల వైపు విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. అధ్యాపకులు సైతం పరిశోధనల్లో నిమగ్నం అవ్వాలన్నారు. పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థులు తమ పరిశోధన కాలంలో



మాట్లాడుతున్న ఎంజీయూ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్

కనీసం రెండు పరిశోధన పత్రాలను సమర్పించాలని, ఆ దిశగా అధ్యాపకులు ప్రోత్సహించాలని సూచించారు. గతంలో రూపొందించిన కోర్సు ఉద్దేశాలు ప్రోగ్రాం ఉద్దేశాల దృక్కోణంలో పరీక్షల ప్రశ్నాపత్రాలను రూపొందించడం ద్వారా మూల్యంకనంలో ప్రతిబింబుస్తుందన్నారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమ శాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండ పంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు,



నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు

ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్టింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొన సాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవారలను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వ రస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 14,24,320 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

సాగర్ నీటి మట్టం 588.50 అడుగులు



నిండు కుండలా ఉన్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు, 588.50 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం స్కేలు

నాగార్జునసాగర్/కేతేపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ జలాశయానికి ఎగువనుంచి వరద రాక నిలకడగా కొనసాగుతోంది. వారం రోజులుగా నిలకడగా 50 వేల క్యూసెక్కుల వరద రాక కొనసాగుతోంది. ఎగువ నుంచి వరద రాక (లక్ష క్యూసెక్కులు దాటితే) పెరిగితే మరో రెండు రోజుల్లో సాగర్ ఒకటి, రెండు క్రస్ట్ గేట్లు ఎత్తే అవకాశం ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) గురువారం సాయంత్రానికి 588.50 అడుగులుగా (307.5790 టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి కుడి కాలువ ద్వారా 5,088 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8,541 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,420 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 44,149 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా ఎగువ నుంచి 65,930 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీ రెండు గేట్ల నుంచి నీటి విడుదల

ఎగువనుంచి వరద పెరగటంతో నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని మూసీ జలాశయం రెండు గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి 2,558.31క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా ప్రాజెక్టు నీటిమట్టం 643.50అడుగులు(4.07టీఎంసీలు)గా నమోదైంది. ప్రాజెక్టు 3, 8నెంబరు క్రస్టుగేట్లను అడుగు మేర ఎత్తి 450క్యూసెక్కులు, ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు 551.65 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఎగువ నుంచి 2558.31క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా ప్రాజెక్టు నీటిమట్టం 643.50అడుగులు(4.07టీఎంసీలు)గా ఉంది.

సెల్‌ఫోన్, లగేజీ టెండర్‌కు రూ.2.22కోట్ల వేలం

● టెండరు దక్కించుకున్న యాదగిరిగుట్ట వాసి ● గతంలో ఇదే టెండరుకు రూ. 1.50కోట్లు

యాదగిరిగుట్ట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి వచ్చే భక్తుల సెల్‌ఫోన్, లగేజీ కౌంటర్ నిర్వహణ టెండర్‌ను రూ.2.22కోట్లకు ప్రై ఇన్‌ఫ్రా టెక్నాలజీస్ సంస్థ దక్కించుకుంది. గురువారం అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి పర్యవేక్షణలో ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సెల్‌ఫోన్లు, లగేజీ టెండరుకు యాదగిరిగుట్టకు చెందిన ప్రై ఇన్‌ఫ్రా టెక్నాలజీస్ సంస్థ నిర్వాహకుడు ప్రవీణ్ రూ. 2,22,22,222తో సీల్డ్ టెండర్ వేసి దక్కించుకున్నాడు. గతంలో ఇదే టెండర్‌ను బీబీనగర్‌కు చెందిన పంజాల సదానంద్‌గౌడ్ రూ.1.50కోట్లకు దక్కించుకోగా, 18శాతం జీఎస్టీ కలిపి రూ. 1.80కోట్లు చెల్లించారు. తాజాగా దక్కిన రూ.2.22కోట్ల టెండరుకు అదనంగా 18శాతం జీఎస్టీతో కలిపి రూ.2.62 కోట్లు చెల్లించాల్సి ఉంది. దేవస్థానం గత నెల 21న లీజెస్ విభాగానికి చెందిన టెండర్లు ఆహ్వానించగా, 16 ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ఒక టెండరు వేశారు. వేలంలో రూ.2.04 కోట్లు పలకగా, రూ.2.22 కోట్లకు దాఖలుచేసిన ప్రై ఇన్‌ఫ్రా టెక్నాలజీస్ సంస్థ టెండర్ దక్కించుకుంది. పాత టెండరు రెండు నెలల (ఆగస్టు, సెప్టెంబరు) గడువు ఉండగా, అక్టోబరు నెల నుంచి ఈ టెండరు ప్రక్రియ అమల్లోకి రానుంది.

ఎన్ఆర్ఐ దాతృత్వం.. రూ.3లక్షల సాయం

మర్రిగూడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రానికి చెందిన యాచారం వెంకటేష్ కొంతకాలం క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మండలకేంద్రానికి చెందిన ప్రవాస భారతీయుడు(ఎన్ఆర్ఐ) యాచారం రమేష్



బాధిత కుటుంబానికి బాండ్ అందజేస్తున్న ఎన్ఆర్ఐ రమేష్ తల్లి లింగమ్మ

బాధిత కుటుంబానికి రూ.3లక్షలు బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేసి బాండ్ పేపర్‌ను రమేష్ తల్లి లింగమ్మ ద్వారా వెంకటేష్ భార్యకు గురువారం అందజేశారు. యాచారం రమేష్ వృత్తి రీత్యా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అమెరికాలో స్థిరపడ్డాడు. అమెరికాలో స్థిరపడినప్పటికీ ఉన్న ఊరిని మరవలేదు. నిరుపేద కుటుంబాలను ఆదుకొని సేవా దృక్పథంతో తన వంతుగా తోచినంత ఏదో ఒకరకంగా ఆర్థికంగా సహాయం చేయాలని సంకల్పించారు. మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన యాచారం వెంకటేష్ రోడ్డు ప్రమాదం మృతిచెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో వారి కుటుంబ పోషణ, ఆర్థిక పరిస్థితి భారంగా మారింది. ఈ విషయాన్ని ఇరుగుపొరుగు వారితో వెంకటేష్ ఇంటి పరిస్థితి తెలుసుకున్నారు. రూ.3లక్షలను చిన్నారుల పేర్ల మీద బ్యాంకులో డిపాజిట్ చేసి రమేష్ తల్లి యాచారం లింగమ్మ ద్వారా మృతుడి భార్య సైదమ్మకు బాండ్‌ను అందజేశారు. ఎన్ఆర్ఐ యాచారం రమేష్‌ను గ్రామస్థులు అభినందించారు.

బీసీ రిజర్వేషన్ల పేరుతో సీఎం డ్రామాలు

నల్లగొండ టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి బీసీ రిజర్వేషన్ పేరుతో డ్రామాలు చేస్తోందని బీఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్‌పై చిత్తశుద్ధి లోపించిందనడానికి ఢిల్లీలో చేసిన ధర్నా కార్యక్రమమే నిదర్శనమని అన్నారు. కరీంనగర్‌లో ఈ నెల 14వ తేదీన కరీంనగర్‌లో నిర్వహించ తలపెట్టిన బీసీ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ నాయకులు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్ గురువారం ఆయనను హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 14 నిర్వహించనున్న కరీంనగర్ సభకు పెద్ద ఎత్తున బీసీలను తరలించాలని కేటీఆర్ సూచించారు.



మాజీమంత్రి కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాయకుడు దూదిమెట్ల బాలరాజుయాదవ్ తదితరులు

అసోసియేట్ ప్రొఫెసర్‌గా తండు కృష్ణకౌండిన్య

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రామన్నపేట డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అధిపతి, సాహితీ వేత్త తండు కృష్ణ కౌండిన్యను అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పిస్తూ విద్యాశాఖ కమిషనర్ దేవసేన గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణ కౌండిన్య ప్రస్తుతం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందిన కౌండిన్యను కళాశాల ప్రధానాచార్యులు రహత్ ఖానాం, సాహితీ వేత్తలు కూరెళ్ల విఠలాచార్యులు, వేణు సంకోజు, మేరెడ్డి యాదగిరిరెడ్డి, పెరుమాళ్ల ఆనంద్, సాగర్ల సత్తయ్య, పెందోట సోములు, లింగమూర్తి, మాదగాని శంకరయ్య అభినందించారు.

'పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి'

నల్లగొండ టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు నూకల జగదీష్‌చంద్ర, పందిరి శ్యాంసుందర్ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద 11వ తేదీన నిర్వహించే తెలంగాణ పెన్షనర్ల మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టాప్రా జిల్లా గౌరవాధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, ఎండీ. అబ్దుల్ ఖాదర్, వనం వాణిశ్రీ, వాడపల్లి రమేష్, డివిజన్ కార్యదర్శి గుండాల బిక్షమయ్య పాల్గొన్నారు.

సాగు చట్టాలపై అవగాహన ఉండాలి

● రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు భూమి సునీల్

నిడమనూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సాగు చట్టాలపై రైతులు అవగాహన కలిగి ఉండి పంటలు సేద్యం చేయాలని రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు భూమి సునీల్ అన్నారు. సాగు న్యాయ యాత్రలో భాగంగా లీఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రంలోని రైతువేదికలో 'రైతుకు చట్టాలను చుట్టం చేయడమే లక్ష్యం' అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 60శాతానికి పైగా జనాభాకు వ్యవసాయమే జీవనాధారమన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు అనేక చట్టాలు అమలు చేస్తున్నాయని గుర్తు చేశారు. సాగు రంగంలో చట్టాల పాత్ర పెరుగుతూ వస్తున్నందున రైతులు చట్టాలను వినియోగించుకొని సేద్యం చేసినప్పుడే న్యాయం జరుగుతుందన్నారు. స్వాధీనంలో భూమి, చేతిలో పట్టాదారు పాస్‌పుస్తకం, భూభారతిలో పేరు ఉంటేనే భూమికి భద్రత ఉంటుందన్నారు. నాణ్యమైన విత్తనం రైతుల హక్కు అని, నాణ్యత లేని విత్తనాలతో నష్టం జరిగితే రైతులు పరిహారం పొందవచ్చునన్నారు. రైతులకు సాగునీటిని అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. రైతులకు బ్యాంకులు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పంట రుణాలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. రుణం పొందిన రైతులు పంట నష్టం జరిగితే పంటల బీమా కాపాడుతుందన్నారు. రైతులు పండించిన ఉత్పత్తులు అమ్ముకునేందుకు సరైన మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. సమావేశంలో భూదాన్ బోర్డు మాజీ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి, ఓఎస్డీ హరివెంకటప్రసాద్, హాలియా ఏడీఏ సరిత, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఏవో మునికృష్ణయ్య, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, ఏఈవోలు దండెం విజయచంద్ర, మహేష్, క్రాంతి, అనిల్, లీఫ్స్ ప్రతినిధులు అభిలాష్, జీవన్, మల్లేష్, ప్రవీణ్, సందీప్, రైతులు శివ మారయ్య, నర్సింగు విజయ్, పోలే రవి, మోసాల శ్రీను, పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి భూభారతి

మిర్యాలగూడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ధరణి కమిటీ సభ్యుడు, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు ఎం. సునీల్ అన్నారు. గురువారం స్థానిక రైతు వేదికలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, సాగురంగంలో చట్టాల పాత్ర పెరుగుతుందని, చట్టాలను వినియోగించుకుంటే ఏరువాక సాఫీగా సాగుతుందన్నారు. అనంతరం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌లు లీఫ్స్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.



నిడమనూరులో మాట్లాడుతున్న రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు సునీల్

కోదాడ రూరల్: సాగురంగంలో చట్టాల పాత్ర పెరుగుతోందని రాష్ట్ర రైతు సంక్షేమ కమీషన్ సభ్యులు భూమి సునీల్ అన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని అల్వాలపురం రైతు వేదికలో గురువారం సాగు న్యాయయాత్ర సమావేశం నిర్వహించారు. దేశంలో అధిక శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడుతున్నట్లు తెలిపారు. రైతులు చట్టాలను వినియోగించగలిగితే ఏరువాక సాఫీగా జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి గ్రామాల్లో సాగు న్యాయయాత్ర చేపట్టినట్లు తెలిపారు. రైతులకు అవగాహన కల్పించేందుకు సమావేశాల రూపంలో అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వాజిద్, ఏవో రజిని, వంగవీటి రామారావు, ఎర్రవరం ప్యాక్స్ చైర్మన్ నల్లజర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలు

ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో గురువారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. పాఠశాల్లో విద్యార్థినులతో విద్యార్థులందరికీ రాఖీలు కట్టించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులందరూ సోదర భావంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాకమల్లు, శ్రీను, సుధాకర్, కర్ణాకర్, తిరుమలేష్, పాల్గొన్నారు.

సన్నబియ్యం, రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత ప్రభుత్వానిది

తిరుమలగిరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సన్నబియ్యం, రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సంకెపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. గురువారం తిరుమలగిరిలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి సొంత డబ్బా కొట్టుకోవడం మానుకోవాలన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత ప్రభుత్వంపై నిందలు వేయడం తగదన్నారు.

సమాచారం

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

హుజూర్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ పరిరక్షణకు కృషిచేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి దామోదర్, చిక్కుళ్ల గోవింద్, లక్ష్మీకాంత్ కోరారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, గోవింద్, జ్యోతి, శ్రీను, సైదులు, ప్రభాకర్‌రెడ్డి, అజయ్, చంద్రశేఖర్, రాజశేఖర్‌రెడ్డి, శైలజ, కమల తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

హుజూర్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు జక్కుల నరేందర్‌యాదవ్ కోరారు. గురువారం పట్టణంలో జక్కుల శ్రీకాంత్‌కు రూ.30వేలు, వేముల మౌనికకు రూ.53వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోడి ఉపేందర్, హనీఫ్, చింతకాయల రాము, శ్రీను, శ్రీనివాసు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

తుంగతుర్తి, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ చెందిన తడకమళ్ల వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మూడేళ్ల క్రితమే ఆయన భార్య రాములమ్మ మృతి చెందింది. దీంతో వారి ఇద్దరు ఆడపిల్లలు ఒంటరిగా మారారు. ఆ ఇద్దరి పిల్లలకు అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు రూ.5400లు, 50కిలోల బియ్యం గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కొండగడుపుల ప్రశాంత్, సాయిబాబు, శ్రీనివాస్, అజిత్, మనోజ్, శరత్, శివాజి, మహేష్ పాల్గొన్నారు.

క్విజ్‌తో విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించవచ్చు

తుంగతుర్తి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): క్విజ్‌తో విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించవచ్చని హెచ్‌ఎం చిత్తలూరి వెంకట్రామ నర్సమ్మ అన్నారు. గురువారం మండలంలోని వెంపటి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మల్లెపాక రవీందర్, గట్టు మాధవి, బండారు భవాని, జీడి అనిల్ కుమార్, మాలోత్ కృష్ణ, గుండ్ల అంజనేయులు, శిలోజు రమాదేవి, అబ్బగాని మంజుల పాల్గొన్నారు.

పేదలందరికీ రేషన్ కార్డులు మంజూరు

హుజూర్‌నగర్ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ రేషన్‌కార్డులు మంజూరుచేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చక్కెర వీరారెడ్డి, రాంబాబురెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని వేపల సింగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం అర్హులందరికీ రేషన్‌కార్డులు అందిస్తోందని అన్నారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, గోపిరెడ్డి, మంగమ్మ, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

బహుళ జాతి కంపెనీలు వైదొలగాలి

ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో విదేశీ బహుళ జాతి కంపెనీలు దేశం నుంచి వైదొలగాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు అన్నారు. గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ దిష్టి బొమ్మను దహనం చేసి మాట్లాడారు. దేశ ఎగుమతులపై 25శాతం సుంకం విధిస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకోవడం వాణిజ్య ఒప్పందాలను ఉల్లంఘించడమేనన్నారు. కార్యక్రమంలో సామ నర్సిరెడ్డి, దాసరి శ్రీనివాస్, సంజీవరెడ్డి, నాగయ్య, భరత్ పాల్గొన్నారు.

జిల్లాలో ఆధ్యాత్మిక సందడి

కోదాడ రూరల్, తిరుమలగిరి, కోదాడ టౌన్, నూతనకల్, సూర్యాపేట రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లబండ గూడెం సాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముండా రామారావు రమాదేవి, నల మోతు గిరిచంద్ర తేజస్విని, అనిల్‌కుమార్ రమాదేవి దంపతులు, సురేష్, రవీంద్ర బాబు, రమేష్, చెరుకూరి ప్రభాకర్, సతీష్, పాపల్ల ప్రణీత్, పర్వతనేని కృష్ణయ్య, శేషు, అర్చకులు సాయిశర్మ, శేషు, నల్లపాటి ఆదినారాయణ పాల్గొన్నారు.



తిరుమలగిరి ముత్యాలమ్మ గుడిలో బోనాలు సమర్పిస్తున్న మహిళలు

వైభవంగా ముత్యాలమ్మ తల్లికి బోనాలు

తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధిలో ముత్యాలమ్మ తల్లి బోనాలను గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రజలు బోనాలు వండి, డప్పుచప్పుళ్లతో గుడివద్దకు వెళ్లి సమర్పించారు.

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా శీరంగాపురం కాలనీ వాసులు కోరారు. గురువారం కోదాడలోని ముత్యాలమ్మ తల్లికి ఊరేగింపుగా వెళ్లి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపురం వాసులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● నూతనకల్ మండలంలోని మిర్యాల గ్రామంలో గురువారం బోనాల పండగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలలో ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని గ్రామ దేవతైన ముత్యాలమ్మ తల్లికి సమర్పించారు. అనంతరం అమ్మవారికి జంతుబలులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.



పిల్లలమర్రి గ్రామంలో బోనంతో వెళుతున్న మహిళా భక్తులు



కోదాడలో పూజల్లో పాల్గొన్న భక్తులు

● సూర్యాపేట మునిసిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి గ్రామంలో ముత్యాలమ్మ బోనాల పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళలు మట్టి కుండలలో బోనం వండుకుని పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి సామూహికంగా ఊరేగింపుగా వెళ్లి ముత్యాలమ్మకు సమర్పించారు. గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్‌ను అమలు చేయాలి

తిరుమలగిరి రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్‌కు కేంద్ర ప్రభుత్వం పెంచాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు అన్నారు. గురువారం తిరుమలగిరి మండలంలోని తొండ గ్రామంలో జరిగిన బీసీ హక్కుల సాధన సమితి నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదు శాతం ఉన్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ 10 శాతం పెంచి 56 శాతం బీసీ రిజర్వేషన్‌ను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు ఉత్సాహం చూపడం లేదని ఆయన న్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రతి పక్షంలో ఉన్న బీజేపీ కుల గణన చేపట్టాలని అనేక సందర్భాలలో డిమాండ్ చేసిందని, కాంగ్రెస్ పార్టీ కుల గణన చేపడితే బీజేపీ ఎందుకు మద్దతు తెలపడంలేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేపట్టిశాసన సభలో బిల్లు ఆమోదించి నాలుగు నెలల క్రితం కేంద్రానికి పంపినా, ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేయడానికి కారణం ఎమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో యాదగిరి, కిరణ్, రాజు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలి

సూర్యాపేట టౌన్, కోదాడ టౌన్, తిరుమలగిరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాలను ప్రతిఒక్కరూ ధరించాలని సూర్యాపేట చేనేత సహకార సంఘం అధ్యక్షుడు కడారి భిక్షం అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం జియో ట్యాగింగ్ నెంబర్లు ఇవ్వాలని, చేనేత కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన కార్మికులకు చేనేత భరోసా కార్యక్రమాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎల్లయ్య, యాదగిరి, ముశం వెంకట నారాయణ, గండూరి రమేష్, రాపోలు గిరీష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

● చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పద్మశాలీ సంఘం కోదాడ పట్టణ అధ్యక్షుడు జి.నాగరాజు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని గురువారం కోదాడలో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్డులో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పద్మశాలి సేవా సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి జి.రాజేష్, నియోజకవర్గ అధ్యక్షుడు కె.నరసింహారావు, పట్టణ కార్యదర్శి పి.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎ.వెంకటరావు, సీహెచ్ మట్టయ్య, బి.శేషగిరి, రత్నాకర్ పాల్గొన్నారు.

● చేనేత రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని చేనేత సంఘం నాయకుడు వంగరి బ్రహ్మం కోరారు. చేనేత దినోత్సవాన్ని గురువారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో పద్మశాలీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత రంగాన్ని కాపాడడానికి అవసరమైన పథకాలు రూపొందించాలన్నారు. చేనేత కార్మికులకు పక్కా భవనాలు, స్టాండ్ మగ్గాలు అందజేయాలని, చేనేత ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మద్దూరి శంకరయ్య, దుస్సా రాంమూర్తి, కృష్ణమూర్తి, సోమయ్య, మల్లయ్య, నాగరాజు, ఉప్పలయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.



సూర్యాపేటలో జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న కడారి భిక్షం

న్యాయవాది శ్రీనివాస్‌కు డాక్టరేట్



హుజూర్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్‌కు చెందిన హైకోర్టు న్యాయవాది మారగాని శ్రీనివాస్‌గౌడ్ డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. త్వరలో జరగనున్న స్నాతకోత్సవంలో శ్రీనివాస్‌కు డాక్టరేట్‌ను వైస్ చాన్స్‌లర్ ప్రదానం చేయనున్నారు.ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో 'ఏ స్టడీ ఆన్ సర్వీస్ క్వాలిటీ అస్సెస్‌మెంట్ ఆఫ్ సెలెక్ట్ హాస్పిటల్స్ ఇన్ హైదరాబాద్' అనే అంశంపై ఓయూ సీనియర్ ప్రొఫెసర్ వెంకటయ్య ఆధ్వర్యంలో పరిశోధన చేసినందుకు ఓయూ నుంచి డాక్టరేట్ సాధించారు. గతంలో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కమ్యూనికేషన్ జర్నలిజంలో శ్రీనివాసగౌడ్ గోల్డ్‌మెడల్ సాధించారు.

దివ్యాంగులకు విద్యాబుద్ధులు నేర్పడం అభినందనీయం

సూర్యాపేట రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు విద్యాబుద్ధులు నేర్పడం అభినందనీయమని ఎంఈవో శేషగాని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. వివేక ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కాసరబాద రోడ్డులోని అపూర్వ బధిరుల పాఠశాలలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్స్, పెన్సిల్స్, శాలువాలు అందజేశారు. దివ్యాంగులకు సేవలు అందిస్తున్న వివేక ఫౌండేషన్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్య క్షుడు తీకుళ్ల సాయిరెడ్డి, పాఠశాల వ్యవస్థాపకుడు మదనాచారి, పచ్చిపాల శ్రీనివాస్, శేరి నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఫీజుల పేరుతో విద్యార్థులను వేధించొద్దు

సూర్యాపేట టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఫీజుల పేరుతో విద్యార్థులను వేధించొద్దని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌వర్మ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో విద్యను అందిస్తామని కళాశాలలో అడ్మిషన్లు ఇచ్చి, విద్య పూర్తయిన తర్వాత ఫీజులు చెల్లించమనడం సరి కాదన్నారు. డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఉన్నత చదువులు, ఇతర ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేయాలంటే సర్టిఫికెట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు వినయ్, నాగరాజు, దివ్య, శ్రావ్య, శ్రవణ్, గణేష్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది



తొండ ప్రాథమిక పాఠశాలలో టీవీని బహూకరిస్తున్న దాత సుధాకర్

తిరుమలగిరి రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం మరువలేవనిదని తొండ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం వి.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని తొండ బీసీ కాలనీ ప్రాథమికి పాఠశాలకు గుండా సుధాకర్ 43అంగుళాల ఎల్‌ఈడీ టీవీని బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాల న్నారు. ఈ సందర్భంగా దాత సుధాకర్‌ను ప్రాథమిక, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఓ.వెంకన్న, బి.సోమనారాయణ, లక్ష్మయ్య, పుల్లయ్య, రవీందర్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సైదులు, సత్యనారాయణ, ఉపాధ్యాయులు వెంకట్, రాజు, నాగయ్య, వీరన్న పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

నేరేడుచర్ల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దిర్శించర్లలోని పంచాయతీ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గున్‌రెడ్డి సైదిరెడ్డి మాట్లాడుతూ కంటి పరీక్షలు అనంతరం పేదలకు ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బంగారు స్వాతి, వీరేంద్రాచారి, లయన్స్ క్లబ్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, కీత కనకయ్య, చిత్రం విశ్వనాథం, గంధం శావయ్య, తుమ్మలూరి సైదిరెడ్డి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత తప్పనిసరి



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారి ప్రవీణ్‌కుమార్

కోదాడ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ ఆయిల్ సూర్యాపేట, ఖమ్మం జిల్లాల సేల్స్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. అగ్ని ప్రమాదాల నియంత్రణకు గురువారం మండలంలోని గుడిబండ శివారులోని అంజన్ ఇండియన్ గ్యాస్ గోడౌన్ వద్ద డెమో ఏర్పాటు చేశారు. ఇండియల్ ఆయిల్ టైయప్ కంపెనీ బ్రాండ్స్ డాడీ రూపొందించిన ఆటో ఫెయిర్ ఎస్టింగ్ మిషన్ ప్రతిగృహంలో అమర్చుకోవాలని సూచించారు. విద్యుత్, గ్యాస్, ఇతర అగ్ని ప్రమాదాలను ఈ యంత్రం నియంత్రిస్తోందని, ఆ యంత్రం ప్రయోజనాలను గ్రామస్థులకు వివరించారు. అనంతరం డెమోలో పాల్గొని విజయవంతంగా ప్రయోగం చేశారు. ఈ కార్యక్రమంలో నల్గొండ సేల్స్ ఆఫీసర్ సంపత్‌కుమార్, కంపెనీ ప్రతినిధులు శైలేష్, దీపిక, అంజన్‌గౌడ్, రాజశేఖర్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి

కోదాడ టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని అపరిచిత వ్యక్తులు మీ ప్రాంతంలో తిరుగుతుంటే అనుమానాస్పద స్థితిలో ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పట్టణ సీఐ శివశంకర్ అన్నాడు. పోలీస్ ప్రజాభరోసా కార్యక్రమాన్ని భాగంగా గురువారం కోదాడలోని 18వ వార్డులో సీఐ శివశంకర్, ఎస్‌ఐ హనుమాన్ మాజీ కౌన్సిలర్ కర్రి శివసుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శివశంకర్ మాట్లాడుతూ ప్రజలు తీసుకోవాలన్సి పలు జాగ్రత్తలపై సూచనలు చేశారు. ముఖ్యంగా అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలందరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

నులి పురుగులను నివారించాలి

నేరేడుచర్ల, అనంతగిరి, నూతనకల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో నులి పురుగులను నివారించాలని నేరేడుచర్ల, అనంతగిరి, నూతనకల్ మండలాల వైద్యాధికారులు నాగిని, పుష్ప, సందీప్ అన్నారు. ఈ నెల 11న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా నేరేడుచర్ల, పాలకవీడు, అనంతగిరి, నూతనకల్ మండలాల ఉపాధ్యాయులకు గురువారం నిర్వహించిన శిక్షణా శిబిరంలో వారు మాట్లాడారు. .ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సల్వాది శ్రీనివాసు, సూపర్‌వైజర్ ధనమ్మ, ఎంఈవో పుట్టూరి సత్యనారాయణరెడ్డి, హెచ్ఇఓ ఉపేందర్, సూపర్వైజర్ ఉమామహేశ్వరి, యాతాకుల మధుబాబు, సీహెచ్‌వో చరణ్, చిన్న, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు. ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల పిల్లలకు ఈ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. మాత్రను నమిలి మింగించి పరిశుభ్రమైన నీటిని తాగించాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఖాళీ కడుపుతో ఈ మాత్రను ఇవ్వవద్దు అని తెలిపారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

మునగాల రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నర్సరీల ద్వారా ప్రజలందరికీ ఉచితంగా ఇచ్చే మొక్కలను ప్రతిఒక్కరూ నాటి సంరక్షించాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో శిరీష అన్నారు. గురువారం మండలంలోని మాధవరం గ్రామంలో వన నర్సరీలో మొక్కలను ఆమె పరిశీలించి మాట్లాడారు. నర్సరీలో అన్నిరకాల పండ్ల, పూల మొక్కలను నర్సరీ సిబ్బంది ఇంటింటికి ఉచితంగా పంపిణీ చేయాలని, ప్రతిఒక్కరూ తమ నివాసంలో, ఖాళీ ప్రదేశాల్లో వాటిని నాటి సంరక్షించాలన్నారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేసి చిన్నారులకు అందిస్తున్న పాలు, పండ్లు, గుడ్లు, పౌష్టికాహారాన్ని పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ దీన్‌దయాళ్, ఎంఈవో వెంకటేశ్వర్లు, ఏపీవో శైలజ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి దేవాలయం వార్షికోత్సవం రేపు

నేరేడుచర్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నేరేడుచర్లలోని అయ్యప్పస్వామి దేవాలయం మొదటి వార్షికోత్సవాన్ని ఈ నెల తొమ్మిదో తేదీన నిర్వహిస్తామని ఆలయ కమిటీ ధర్మకర్త కొణతం కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం నేరేడుచర్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా వేద పండితుడు ఇరువంటి సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం, యాగం, పడి పూజ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చిన్నపల్లి శ్రీనివాస్, చిట్యాల శ్రీను, ఒంటెద్దు ప్రభాకర్‌రెడ్డి, యారవ సురేష్, మన్నెం దుర్గారావు, లక్ష్మారెడ్డి, వెంకటరమణారెడ్డి, కనకారెడ్డి పూర్ణచంద్రారెడ్డి పాల్గొన్నారు

దరఖాస్తుల పరిశీలనను పూర్తి చేయాలి

నూతనకల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల భూముల క్షేత్ర స్థాయి పరిశీలనను త్వరగా పూర్తిచేయాలని అధికారులను సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవ్‌రావు ఆదేశించారు. భూభారతి దరఖాస్తులపై గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. . సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి దానికి సంబంధించిన ప్రతులను జతచేసి భూభారతి నిబంధనల మేరకు ఆమోదించాలన్నారు. ఈ ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ వంశీరాజ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో వేణుమాధవ్‌రావు

తల్లి పాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి

చింతలపాలెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తల్లి పాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఎంపీడీవో బోపాల్‌రెడ్డి అన్నారు. తల్లిపాల ప్రాముఖ్యంపై గురువారం చింతలపాలెం మండల గ్రామపంచాయతీ కార్యాలయంలో గర్భిణులు, బాలింతలకు ఏర్పాటుచేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలింతలు అపోహలు వీడి బిడ్డలకు తల్లిపాలు పట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భూపాల్‌రెడ్డి, ఏపిఎం శేషయ్య, పంచాయతీ కార్యదర్శి షేక్ నాగులు మీరా, మేరీ, వినయ్‌కుమార్, ఏఎన్‌ఎం కల్యాణి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, టీచర్లు, వీవోఏలు, తల్లులు, గర్భిణులు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

పునాదుల్లోనే ఎత్తిపోతలు

(5వ పేజీ తరువాయి)

అంకురార్పణ చేశారు. ఈ పనులు చేయడంలోనూ నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

● పాలకవీడు మండలం బెట్టెతండా పరిధిలో 2,040 ఎకరాలకు రూ.37 కోట్లు మంజూరుచేశారు. ఇక్కడ 30 శాతం పనులు మాత్రమే పూర్తిచేశారు. అదేవిధంగా ఇదే మండలంలోని జవహర్-జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకాన్ని రూ.302 కోట్లతో 10వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా రూపొందించారు. పనులు ప్రారంభించి ఆరు నెలలు దాటినా అనేక సాంకేతిక కారణాలతో పనులు నత్తనడకన సాగుతున్నాయని రైతు సంఘాల ఆరోపిస్తున్నాయి.

రైతుల డిమాండ్లు

గొలుసుకట్టు చెరువులకు ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. నేరేడుచర్ల మండలం సోమారం, కల్లూరు, పెంచికల్‌దిన్నె, చింతకుంట్ల, చిల్లేపల్లి గొలుసుకట్టు చెరువులను నింపేందుకు మూసీ నది నుంచి నీటిని ఎత్తిపోయాలని ఆయా ప్రాంతాల రైతులు కోరుతున్నారు. ఇక్కడి ఎత్తిపోతల ఏర్పాటు చేస్తే సుమారు 30వేల ఎకరాలకు సాగునీరందే అవకాశాలు ఉన్నాయని రైతులు పేర్కొంటున్నారు. అదేవిధంగా వేములూరు వాగు ప్రాజెక్ట్ నుంచి లింగగిరి చెరువుకు ఎత్తిపోతలను ఏర్పాటుచేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు. గత 20 ఏళ్లగా ఎత్తిపోతల ద్వారా లింగగిరి చెరువును నింపాలని అనేక ప్రతిపాదనలు పంపారు. అయినా వీటికి మోక్షం రాకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్ష ఎకరాలకు సాగు నీరందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఎత్తిపోతల పథకాల పనులను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి



ఎత్తిపోతల పథకాల పనులను వేగంగా పూర్తిచేయాలి. పనుల్లో నాణ్యత లేకపోతే సంబంధిత శాఖ అధికారులపై చర్యలు తీసుకుంటాం. ప్రతి ఎకరానికీ నీరు అందించేందుకు ఎత్తిపోతల పథకాలు ఉపయోగపడతాయి. ఆయకట్టు చివరి భూములను సస్యశ్యామలం చేస్తాం. నా హయాంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో రైతులకు మేలుచేసేలా పనులు చేస్తున్నాం.

●మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పనులు వేగవంతం చేస్తున్నాం

ఎత్తిపోతల పథకాల పనులు వేగవంతం చేస్తున్నాం. కాలపరిమితి ముగిసేలోపు పనులు పూర్తిచేసేందుకు దృష్టి సారించాం. నిత్యం పనులు పర్యవేక్షణచేస్తున్నాం. సమీక్షలతో పనులు మరింత వేగవంతంగా జరుగుతున్నాయి.

● రామ్‌కిషోర్, ఎస్సెస్సీ ఈఈ

ఉపకారం ఆలస్యం

(5వ పేజీ తరువాయి)

ఇంటర్ విద్యార్థులకు సుమారు రూ.190 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాల్సి ఉందని కళాశాలల నిర్వాహకులు చెబుతున్నారు. జిల్లాలో 15 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉండగా ఫీజురీయింబర్స్‌మమెంట్ కింద సుమారు రూ.15 కోట్లు, ఆరు ఇంజనీరింగ్ కళాశాలకు రూ.160 కోట్లు, ఇంటర్ విద్యార్థుల బకాయిలు సుమారు మరో రూ.15 కోట్లు మొత్తంగా రూ.190 కోట్లు అందాల్సి ఉందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. దీంతో అధ్యాపకుల వేతనాలు, భవనాల అద్దెలు, విద్యుత్ బిల్లులు, యూనివర్సిటీ ఫీజులు, అప్పుల వడ్డీలు, ఇతర చెల్లింపులు చెల్లించలేక కళాశాలలు మూసివేసినట్లు పేర్కొంటున్నారు.

పొంతనలేని చెల్లింపులు

కళాశాలలను టెక్నికల్, నాన్ టెక్నికల్‌గా విభజించకపోవటం, ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాలను కలపటంతో ఫీజురీయింబర్స్‌మెంట్ ఎక్కువగా కనిపిస్తోంది. దీంతో గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఫీజురీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో విడుదల చేయకపోవటంతో, రూ.వందల కోట్లలో బకాయిలు పేరుకుపోతున్నాయి. ఫలితంగా తక్కువ ఫీజురీయింబర్స్‌మెంట్ వచ్చే ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాలలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని కళాశాలల నిర్వహకులు వాపోతున్నారు ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.

నడపలేక మూసివేశాం

మూడేళ్లుగా ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదు. దీంతో నిర్వహణ భారంగా మారి కళాశాలలను మూసివేశాం. కోదాడలో ఉన్న ఏడు డిగ్రీ కళాశాలలు మూతపడ్డాయి. ఫలితంగా విద్యార్థులు డిగ్రీ విద్యకు దూరమయ్యే ప్రమాదం నెలకొంది. అంతేకాక ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ప్రధానంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. బకాయిల విషయంలో ప్రభుత్వం మారినా అదే పరిస్థితి. సమస్యను ఉన్నతాధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించి కళాశాలల నిర్వాహకులు ఆర్థికంగా నష్టపోకుండా చూడాలి.

●ముత్తినేని సైదేశ్వరరావు, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు